క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి : పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్నందున సోమవారం నార్కట్‌పల్లి ఇండస్ట్రియల్ ఏరియా, గోపలాయపల్లి, చిట్యాల ఇండస్ట్రీయల్ ఏరియా, వట్టిమర్తి పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేతేపల్లి: ఆర్థిక పునరావాసం పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరుకు దివ్యాంగులు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేతేపల్లి మండలానికి ఒక యూనిట్ మంజూరయిందని పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ.50వేలు సబ్సిడీ అందజేయనున్నట్లు తెలిపారు.

ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంబాల శివలీల, లక్ష్మీబాయి, నాగమణి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవం



సంగీతం ఆలపిస్తున్న గాయకులు

రామగిరి(నల్లగొండ): ఎన్‌సీఆర్ శాస్త్రీయ సంగీత పీఠం ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని న్యూస్ స్కూల్‌లో త్యాగరాజ ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సంగీత గాయకుడు ఎన్‌సి. రంగాచార్యులు, శిష్యులు బి.సంజన, బి.సాహితి శాస్త్రీయ పాటలను ఆలపించారు. ఎన్‌సి.అనంతకృష్ణ, ధృవ వయోలిన్, విలేష్ మృదంగం, వనమాలి, మాధవ వేణువు, దామోదరాచార్యులు తబలా, హరికృష్ణ కీబోర్డును ప్లే చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ కృష్ణారెడ్డి

మర్రిగూడ : మండలంలోని వట్టిపల్లి శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్‌ఐ మునగాల కృష్ణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 3 నుంచి 6 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 4న స్వామివారి కల్యాణం, 5న రథోత్సవం నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు వేడుకలను విజయవంతం చేయాని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండాల అల్వాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎడ్ల కాశయ్య, ఆలయ చైర్మన్ సిరసవాడ భిక్షం, ప్రధాన కార్యదర్శి కొంపల్లి నాగరాజుగౌడ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సల్వోజు భిక్షమాచారి, ఆర్గనైజర్ కున్‌రెడ్డి గిరి, శ్రీకాంత్, లింగయ్య, రాజు, గణేశ్, విజయ్, రఘు, వేణు, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల టూల్ డౌన్



నినాదాలు చేస్తున్న ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ నాయకులు

చిట్యాల: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్, పీఓపీ, ప్లంబర్, టైల్స్ మార్బుల్స్ వర్కర్స్ రేట్లను పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. చిట్యాలలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టూల్ డౌన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ నాయకులు చిట్యాల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బారాల స్వామి, కమ్మంపాటి నర్సింహ, అర్రూరి సత్తయ్య, బెల్లి యాదయ్య, తాడూరి చంద్రం, లింగస్వామి, రమేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ !

- రూ.5.54 కోట్ల వ్యయంతో రోడ్ల అభివృద్ధికి శ్రీకారం
- తీరనున్న వాహనదారుల ఇబ్బందులు



అభివృద్ధి చెందనున్న శాలిగౌరారం–భైరవునిబండ రోడ్డు

శాలిగౌరారం: మండలంలోని మూడు ప్రధాన పంచాయతీరాజ్(పీఆర్) రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఎంతోకాలంగా అధ్వానంగా ఉన్న శాలిగౌరారం–భైరవునిబండ, భైరవునిబండ–అమ్మనబోలు(రామాంజాపురం క్రాస్), గురుజాల–ఉప్పలంచ పంచాయతీరాజ్ రోడ్లు ఎట్టకేలకు అభివృద్ధి చెందనున్నాయి. దీంతో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, జాలోనిగూడెం, తక్కెళ్ళపహాడ్, భైరవునిబండ, ఎస్‌జి కొత్తపల్లి, రామాంజాపురం, ఉప్పలంచ, మనిమద్దె గ్రామాలతోపాటూ నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ కృషితో ప్రభుత్వం రూ. 5.54 కోట్ల నిధులను రోడ్ల అభివృద్ధికి మంజూరు చేసింది.

198.4 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు

శాలిగౌరారం మండలంలో పంచాయతీరాజ్ రోడ్లు 58 ఉండగా ఆయా రోడ్ల పొడవు 198.4 కిలోమీటర్లు. అదేవిధంగా మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల పొడవు 58 కిలోమీటర్లు. మండలంలోని మొత్తం రోడ్ల పొడవు 256.4 కిలోమీటర్లు.

ఆన్‌లైన్ పద్ధతిలో టెండర్ ప్రక్రియ

మండలంలోని శాలిగౌరారం–భైరవునిబండ, భైరవునిబండ–అమ్మనబోలు, గురుజాల–ఉప్పలంచ పంచాయతీరాజ్ రోడ్లను ఎంఆర్ఆర్(మెయింటినెన్స్ ఆఫ్ రూరల్ రోడ్లు) నిధుల నుంచి రూ. 5.54 కోట్ల వ్యయంతో బీటీ రెన్యూవల్‌గా అభివృద్ధి చేయనున్నారు. వాటిలో శాలిగౌరారం నుంచి భైరవునిబండ వరకు 9 కిలోమీటర్ల పొడవు ఉన్న రోడ్డును రూ.2.25 కోట్లతో, భైరవునిబండ నుంచి అమ్మనబోలు(రామాంజాపురం క్రాస్) వరకు 5.20 కిలోమీటర్లు పొడవు ఉన్న రోడ్డును రూ. 1.31 కోట్లతో, గురుజాల నుంచి ఉప్పలంచ వరకు 8 కిలోమీటర్ల పొడవు ఉన్న రోడ్డును రూ. 1.98 కోట్లతో బీటీ రెన్యూవల్‌గా అభివృద్ధి పరచనున్నారు. అధికారులు ఆన్‌లైన్ పద్ధతిలో టెండర్ ప్రక్రియను పూర్తిచేసేందుకు సిద్ధమవుతున్నారు. అనంతరం అగ్రిమెంట్ చేసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ పాటుపడుతున్నాడు. ప్రధానంగా ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

–కందాల సమరంరెడ్డి, శాలిగౌరారం మండలం

ప్రయాణ కష్టాలు తొలగిపోనున్నాయి



శాలిగౌరారం–భైరవునిబండ, భైరవునిబండ–అమ్మనబోలు, గురుజాల–ఉప్పలంచ పంచాయతీరాజ్ రోడ్లు అభివృద్ధి చెందనుండడంతో అనేక గ్రామాల ప్రజల ప్రయాణ కష్టాలు తొలగిపోనున్నాయి. దశాబ్ద కాలంగా రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు.

–షేక్ జహంగీర్, జాలోనిగూడెం, శాలిగౌరారం మండలం

టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం



శాలిగౌరారం–భైరవునిబండ, భైరవునిబండ–అమ్మనబోలు, గురుజాల–ఉప్పలంచ పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ. 5.54 కోట్లు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే అగ్రిమెంట్ చేసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

–భరత్‌చంద్ర, పంచాయతీరాజ్ ఏఈ, శాలిగౌరారం

వైభవంగా లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం



పూజలో పాల్గొన్న నాయకులు

కేతేపల్లి: మండలంలోని కొప్పోలు గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి అమ్మవార్ల విగ్రహాలు ఉంచి స్థానిక ఆలయాల ప్రధాన అర్చక బృందం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, మంటపారాధన పుణ్యవచనం, కంకణధారణ తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తిరుపతమ్మ మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. వేడుకల్లో ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, దైద రవీందర్, ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ గుత్త మంజుల మాధవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, గార్లపాటి రవీందర్‌రెడ్డి, కాంతయ్య, శ్రీరాములు, కప్పల సైదులు, కేశవరెడ్డి, దుర్గం వెంకన్న, తిరుమలయ్య, నిమ్మకంటి శ్రీను, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓరుగంటి శ్రీనివాస్ సేవలు అభినందనీయం



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న యూనియన్ ప్రతినిధులు

నల్లగొండ: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా కట్టంగూర్ మండలం పరడలో ఓరుగంటి శ్రీనివాస్ చేసిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన ఓరుగంటి శ్రీనివాస్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్. ఫణికుమార్, కార్యదర్శి మేకల జానారెడ్డి, మాజీ కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, బసిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, కూకుట్ల నర్సింహ, అంబటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



నల్లగొండ టౌన్: నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు



చిట్యాల : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



గట్టుప్పల్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం విమర్శించారు. ఆదివారం పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక సుభాష్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుపేదలకు, రైతులకు, రైతు కూలీలకు ఎలాంటి లాభం చేకూర్చేలా లేదన్నారు. జిల్లాకు రైల్వే కేటాయింపుల్లో అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దండంపల్లి సత్తయ్య, ఎండీ. సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, అవుట రవీందర్, పి.మధుసూదన్‌రెడ్డి, భూతం అరుణ, సైదాచారి, గౌరిదేవి, మధుసూదన్, వెంకటయ్య, సుల్తాన్ పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులకు అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైల్వే ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పుచ్చకాయల నర్సిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించిన ఎలాంటి ప్రస్తావన లేకపోవడం అన్యాయమన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాలలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ, లడే రాములు, గుడిసె లక్ష్మీనారాయణ, మాదరబోయిన వెంకన్న, ఐతరాజు యాదయ్య, వీరమళ్ళ పార్వతమ్మ, మారయ్య, కిరణ్, చంద్రమౌళి, నాగయ్య పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

చండూరు (గట్టుప్పల్) : కేంద్ర బడ్జెట్ పేదల వ్యతిరేక బడ్జెట్ అని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య, రైతు సంఘం నాయకుడు బండా శ్రీశైలం విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో బడ్జెట్ కాపీల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో అదనంగా నిధులు పెంచలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి. కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, పసుపుల చెన్నయ్య కర్నాటి యాదయ్య ఏడుకొండలు, నవీన్, దుబ్బాక శంకర్, మంగ యాదయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలను నిండా ముంచిందని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నీలకంఠం రాములు, దామెర లక్ష్మీ, కొట్టం యాదయ్య పాల్గొన్నారు.

నాంపల్లి : కేంద్రం బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐద్వా మండల కార్యదర్శి కొరే లలిత, కార్మికులు పల్లేటి హరికృష్ణ, ఎదుళ్ల సునిత, సజీవ, లక్ష్మయ్య, భిక్షమయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కౌన్సిలర్లు



బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న వంగాల అనిల్‌రెడ్డి కుటుంబ సభ్యులు

నల్లగొండ: పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రి శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు పూలబొకేలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు గజమాలతో శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

నల్లగొండ టౌన్ : నీలగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కాంగ్రెస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.వెంకన్నయాదవ్, లింగస్వామి గౌడ్, మల్లయ్యయాదవ్, పందిరి మధు, శేఖర్‌రెడ్డి, శ్రీను, రామకృష్ణారెడ్డి, రిజ్వాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం పరిధిలోని ఇందుర్తి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గుల్లి యాదయ్య తల్లి ముత్తమ్మ ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు ముత్తమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్, ఊరిపక్క నగేష్, అయితగోని యాదగిరిలు చెరో రూ.5వేల చొప్పున మొత్తం రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు.

బహుమతుల పంపిణీ

నల్లగొండ: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని షీటీమ్స్–మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కోటా కరుణాకర్ అన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ జూనియర్ కళాశాలలో ఆదివారం యూత్ ఫర్ సేవ ఎన్జీఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

నల్లగొండ టూటౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ నాయకుల ఫొటోలతో నల్లగొండ పట్టణంలోని ప్రధాన జంక్షన్‌లు, రోడ్లలో ఏర్పాటు చేసి కోడ్ ఉల్లంఘించారని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ ఆదివారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్, ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బూరుగు నాగరాజు

మర్రిగూడ : ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన బూరుగు నాగరాజు గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం జాతీయ అధ్యక్షుడు గందె ప్రేమ్‌గాంధీ చేతుల మీదుగా నాగరాజు నియామకపత్రం అందుకున్నారు. నాగరాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

డప్పుల ప్రదర్శనను జయప్రదం చేయాలి



నల్లగొండ టౌన్: ప్రచారం నిర్వహిస్తున్న మాదిగ జేఏసీ నాయకులు

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే లక్షల డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయడం కోసం ఈ నెల 5న నల్లగొండలో నిర్వహించే డప్పుల ప్రదర్శనలో మాదిగలు పాల్గొని జయప్రదం చేయాలని మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పెరిక కరణ్ జయరాజ్, జేఏసీ చైర్మన్ కత్తుల జగన్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం గొల్లగూడలో డప్పులతో సంఘీభావ ర్యాలీ నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కత్తుల తులసీదాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కత్తుల సన్ని, బుర్రిస్వామి, తొలకొప్పుల గిరి, చిన్న, కత్తుల కృష్ణ, కత్తుల రాంబాబు, బోయ శివ, కత్తుల పూర్ణ, యశ్వంత్, వంటిపాక సైదులు, యాదయ్య, పరమేష్, మున్నా, వెంకట్, ఎల్లయ్య, తిరుపతయ్య, రాజు మధు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు, వేయి గొంతుకల ప్రదర్శన ర్యాలీ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ బోడ సునీల్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో ప్రదర్శన ర్యాలీ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, ఎంజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్, మల్లెపాక వెంకన్న, గణేష్, బొజ్జ దేవయ్య, ఏడుకొండలు, మేడి శంకర్, మాచర్ల సుదర్శన్, చిన్న, కందుల మోహన్, కొత్త వెంకన్న, పెరిక శ్రీనివాస్, నాగరాజు, సత్యనారాయణ, గోపాల్, నవీన్, జలంధర్, ఏసుపాదం పాల్గొన్నారు.

చిట్యాల: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'లక్ష డప్పులు..వేల గొంతుకలు' సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ కోరారు. చిట్యాలలో ఆదివారం సభ ప్రచార పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, పాల కృష్ణ, పోకల రమేష్, ఉస్కిల్ల భిక్షం, పెరిక నర్సింహ, జోగు ప్రవీణ్, రుద్రవరం దశరథ, పాల మహేష్, పందుల అంజయ్య, ఏర్పుల వినోద్‌కుమార్, జిట్ట శ్రీకాంత్ పాల్గొన్నారు.

'లక్ష డప్పులు వేల గొంతులు'కు మద్దతు

శాలిగౌరారం: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ నేతృత్వంలో ఈ నెల 7న నిర్వహించతలపెట్టిన లక్ష డప్పులు.. వేల గొంతులు సభకు తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం మండల కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు మేడె గోవర్ధన్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న పెన్షనర్లు

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పెన్షనర్లకు రూ.12.75 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్లు ప్రధానిమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ డీఏ, డీఆర్, నగదు రహిత వైద్యం, పీఆర్‌సీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, సుధాకర్, బి.మోహన్‌రావు, రవిప్రసాదరావు, రామలింగం, రమేష్, టి.ప్రకాష్, శంకర్, చొల్లేటి ప్రభాకర్, అచ్యుత్‌రెడ్డి, మహ్మద్ హుస్సేన్, జి. లింగయ్య, వెంకటేశ్వర్లు, యాదగిరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శాలిగౌరారం: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు గురువారావు, కుశలవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, నాగభూషణం, యాదమ్మ, అమృతాదేవిలను పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.

మునుగోడు: మండలంలోని కొంపల్లి ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



మునుగోడు: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

అఖిలపక్ష సమావేశం

మర్రిగూడ : గట్టుప్పల్ మండలంలో నామాపురం, అంతంపేట గ్రామాలు విలీనం కావడంతో మర్రిగూడ మండలంలోని ఎంపీటీసీల స్థానాలపై అభిప్రాయాలను తీసుకునేందుకు ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జి.చినమునయ్య అధ్యక్షతన అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గతంలో అంతంపేట, లెంకలపల్లి, మేటిచందాపురం, కొట్టాల, ఇందుర్తి, సరంపేట గ్రామాలకు ఒక ఎంపీటీసీ స్థానం కాగా నామాపురం గ్రామం గట్టుప్పల్ మండలానికి అనుసంధానం అయింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మేటిచందాపురం, కొట్టాల, ఇందుర్తి, సరంపేట గ్రామాలను కలుపుకుని సరంపేట గ్రామాన్ని ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్‌నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు

నాంపల్లి : మండల కేంద్రంలోని ఉప్పరిగూడెంలో ఆదివారం ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా నిర్వహించారు. పూజారి రాఘవశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గురుకుల ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

నల్లగొండ: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గురుకుల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీజేఏసీ 49 ఉపాధ్యాయ సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గాదే లింగస్వామి, గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, చంద్రశేఖరరావు, సత్యనారాయణ, చిలుముల బాల్‌రెడ్డి, కొడదల శంకర్, ఆదిమల్ల మణిరాజు, బొజ్జ కిరణ్, సంధ్య, శ్రీవాణి, రవీందర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లెపాక వెంకన్న వసంతరావు నాయక్, శ్రీనివాస్ మాలోత్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ): ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం 2025 క్యాలెండర్‌ను టీ జేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తొంట సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆరెకంటి వెంకటయ్య, నూనె విష్ణు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.